

ఫోక్సో కేసుల్లో జాప్యం చేయొద్దు : డిఐజి



ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

ఫోక్సో కేసుల్లో జాప్యం లేకుండా చార్జిషీట్లు దాఖలు చేయాలని జిల్లా ఎస్పీలను డిఐజి రవి ప్రకాష్ ఆదేశించారు. శుక్రవారం అనంతపురం రేంజ్ పరిధిలోని అనంతపురం, శ్రీసత్యసాయి, తిరుపతి, చిత్తూరు జిల్లాల ఎస్పీలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. గత ఏడాది నమోదైన ఫోక్సో కేసుల్లో ఛార్జిషీటు దాఖలు చేయాల్సిన అంశం, యు.ఐ కేసులు, డ్రగ్స్ కేసులపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ ఫోక్సో కేసుల్లో జాప్యం లేకుండా ఛార్జిషీటు దాఖలు చేసి వెంటనే సి.సి నంబర్లు తీసుకోవాలన్నారు. చిన్న పిల్లలపై దారుణంగా జరిగిన అఘాయిత్యాలకు సంబంధించి ప్రతీ ఎస్పీ ఐదు కేసులు, జిల్లాలో ఉన్న డీఎస్పీలు చెరో ఐదు కేసులను వ్యక్తిగతంగా పర్యవేక్షించి కోర్టుల్లో నిందితులకు శిక్షలు పడేలా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ఒకటి కంటే ఎక్కువగా ఫోక్సో కేసుల్లో ఉన్న నిందితులపై షీట్స్ ఓపెన్ చేసి వారిపై నిఘా ఉంచాలని ఆదేశించారు.

దళితులకు పట్టాలిచ్చారు సరే....

ఆన్లైన్లో ఎక్కేదెప్పుడు..?

233 మంది రైతులు నిరీక్షణ
రైతుభరోసా అందని అన్నదాతలు




నీరువాయిలో పంపిణీ చేసిన భూమి

ప్రజాశక్తి - పిచ్చాటూరు

తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలంలోని నీరువాయి, మూడియూర్, కారూరు గ్రామానికి చెందిన పేదవారైన దళితులను రైతులుగా మార్చాలన్న ఉద్దేశ్యంతో టిడిపి ప్రభుత్వంలో 2018, డిసెంబర్ 4వ తేదీన పిచ్చాటూర్ ఐసీసీ క్రికెట్ మైదానంలో అప్పటి మంత్రి నారా లోకేష్ , జిల్లా అధికారుల చేతులు మీదుగా 233 మంది పేదవారికి 101.32 ఎకరాలు భూమిని రైతుల పేరు మీదుగా మార్చిన పట్టాలను బహిరంగ సభలో పంపిణీ చేశారు. అయితే నేటికీ రైతుల దగ్గర పట్టాలు మాత్రమే ఉన్నాయి. వాటి వలన వారికి ఎలాంటి ఉపయోగమూ లేదు. రైతులు ప్రభుత్వం అందజేసిన పట్టాలను బ్యాంకుల దగ్గరికి తీసుకెళితే 'మీకు ఆన్లైన్లో నమోదు చేసి ఈ పాస్ పుస్తకం లేనందున బ్యాంకులో లోన్లు ఇవ్వలేం' అని రైతులకు తెలపడంతో వెనుదిరుగుతున్నారు. అప్పటి తహశీల్దార్, ఇప్పటి గూడూరు ఆర్డీవో గా పని చేస్తున్న ఎం కిరణ్ కుమార్ గ్రామంలో అందరితో కలిసి భూములేని నిరుపేద కుటుంబాలకు భూ పంపిణీ కింద మంజూరు చేయుటకు 101.32 ఎకరాలు భూమిని సర్వే చేసి రాళ్లు నాటించి బౌండరీ గుర్తించారు. అనంతరం 233 మంది పట్టాదారు రైతన్నలకు లక్కీ లాటరీ ద్వారా పట్టాలు పంపిణీ చేశారు పట్టాలు పంపిణీ చేసిన తర్వాత ఆన్లైన్లో నమోదు చేయవలసిన సమయం నందు ఎలక్షన్ కోడ్ అడ్డు రావడంతో బదిలీపై తిరుపతికి వెళ్లిపోయారు, అనంతరం ప్రభుత్వాలు మారి నాలుగేళ్లయినా ఇప్పటికీ రైతుల భూములు ఆన్‌లైన్‌కు ఎక్కలేదు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పేద వారికి అండగా ఉంటానని చెప్పి వచ్చిన ప్రభుత్వం నేటికీ సిజిఎఫ్ ల్యాండ్‌లో భూ పంపిణీ చేసి, పట్టాలు అందజేసి పట్టాలను ఆన్లైన్ లో నమోదు కార్యక్రమాన్ని నేటికీ గుర్తించకపోవడం దారుణమని దళిత రైతులు మండిపడుతున్నారు. ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్న రాష్ట్ర ప్రభుత్వం తమలాంటి పేద రైతులను గుర్తించి శాశ్వతమైన రికార్డుల్లో మార్పులు చేసి పట్టాదారు పాస్ బుక్కులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

అనుమతి వచ్చిన వెంటనే న్యాయం చేస్తా : మధుసూదన్‌రావు, తహశీల్దార్



పిచ్చాటూరు మండలంలో మూడు గ్రామ పంచాయతీల పరిధిలో సిజిఎఫ్ భూములను 233 మంది రైతులకు 2018లో ఇచ్చాం. ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు జిల్లా పాలనాధికారి అనుమతి కోరుతూ రికార్డులు పంపించాం. జిల్లా అధికారుల నుంచి అనుమతి వచ్చిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి పట్టాదారు పాసు పుస్తకాలను అందిస్తాం.

అధికారుల నిర్లక్ష్యం దళితులకు శాపంగా మారింది.. నాలుగేళ్ల క్రితం పట్టాలిచ్చిన భూములు, ఇప్పటికీ ఆన్‌లైన్‌లో ఎక్కకపోవడంతో ప్రభుత్వం తరపున అందే ఏ లబ్ధిని వారు పొందలేకపోతున్నారు. గత టిడిపి హయాంలో ఇచ్చిన భూములు కావడంతో ఇప్పటి వైసిపి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. 101.32 ఎకరాల భూమిని 233 మంది రైతులకు నాలుగేళ్ల క్రితం ఇచ్చారు. మూడేళ్లుగా రైతు భరోసా అందక దాదాపు ఒక్కొక్కరు రూ.30వేల పైనే నష్టపోయామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాస్‌బుక్కులు ఇప్పించండి : కుప్పమ్మ



ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వం కల్పిస్తున్న భూపంపిణీ కింద మా గ్రామంలో రైతులను గుర్తించి అప్పటి అధికారులు సర్వే చేసి భూమి ఇచ్చారు. కానీ ఆన్‌లైన్ చేయలేదు. కారణాలేమో మాకు తెలియదు. అధికారులు స్పందించి శాశ్వత పట్టా పాసు పుస్తకాలు ఇవ్వాలని కోరుతున్నాం.

రైతు భరోసా లేదు : కస్తూరి



రెవెన్యూ అధికారులు సిజెఎఫ్ భూములు చదును చేసి సర్వే చేసి హద్దులు కేటాయించి రాళ్లు నాటారు. పట్టాలు ఇచ్చారు. ఎంతో మేలు చేశారు. కానీ ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. దీంతో రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా మూడేళ్లుగా లేదు. 40వేల రూపాయలు నష్టపోయాను.

బ్యాంకుల్లో రుణాలివ్వడం లేదు : రూప



పొలంలో పంటలు వేయాలంటే డబ్బు కావాలి. పెట్టుబడులు పెట్టలేని పేదరికం మాది. భూమి చూపించి బ్యాంకుల్లో అప్పు తీసుకుందామంటే ఆన్‌లైన్‌కు ఎక్కలేదని తిప్పి పంపుతున్నారు. అప్పులు చేసి పంటలు సాగు చేద్దామంటే వడ్డీలు కట్టలేని పరిస్థితి. మా గోడు ఎవరికి చెప్పుకోవాలి.

పండ్ల తోటలు పెట్టించండి : హంస



కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన జాతీయ ఉపాధి హామీ పథకంలో చిన్న సన్నకారు రైతులకు పండ్ల తోటలు పెట్టుకునే అవకాశాన్ని కల్పిస్తోంది. నా భూమిని చదును చేసుకుని పండ్ల తోటలు పెట్టుకోవాలని ఉపాధి హామీ ఎపిఒ దగ్గరకు వెళితే నీ పేరు మీద రెవెన్యూ రికార్డులో పట్టాదారు పాస్ బుక్ లేదని, వన్ బి తెస్తేనే పండ్ల తోట పెట్టుకోవచ్చని చెప్పారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం : జడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

మానసిక వికాసానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని సంక్రాంతి సందర్భంగా క్రీడలలో పాల్గొన్న ఉద్యోగులందరికీ శుభాకాంక్షలని జిల్లా పరిషత్ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకొని ఉద్యోగుల కోసం జిల్లా పరిషత్ ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం ముగ్గుల పోటీలు, వివిధ క్రీడల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకెళ్తున్న ఘనత ఉద్యోగులకే దక్కుతుందన్నారు. ఉద్యోగులు, సిబ్బంది సంక్షేమానికి ఉన్నతాధికారులు అహర్నిశలు కషి చేస్తున్నారన్నారు. ఇటువంటి క్రీడల నిర్వహణ పట్ల ఉద్యోగులలో మానసిక స్థైర్యం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా వివిధ క్రీడలలో పాల్గొని రాణించిన ఉద్యోగులకు బహుమతులను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ రమ్య, జడ్పీ సీఈవో ప్రభాకరరెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ చంద్రశేఖరరెడ్డి, డీఈవో విజయేంద్రరావు, డ్వామా పిడి దుర్గభవాని, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగజ్యోతి, జిల్లా పంచాయతీ వందర్ల కేంద్రం కో - ఆర్డినేటర్ షణ్ముఖశ్రీరామ్, పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చెంచురత్నంతో పాటు పలువురు పంచాయతీరాజ్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

జిల్లా ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలను పలువురు తెలిపారు. జిల్లా పాడి పంటలతో సస్యశ్యామలం గా తులతూగాలని, రైతులు ఆనందంగా వ్యవసాయం చేస్తూ పండిన పంటలతో ప్రతి కుటుంబం అష్టైశ్వర్యాలతో కళకళ లాడాలని ఆశిస్తున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి, ఎక్సైజ్ శాఖ మంత్రి వర్యు లు నారాయణ స్వామి, జిల్లా ఇన్చార్జి మంత్రి వర్యులు కె.వి.ఉష , రాష్ట్ర అటవీ, విద్యుత్, పర్యావరణ, శాస్త్ర, సాంకేతిక భూగర్భ గనుల శాఖా మంత్రి వర్యులు డా.పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర పర్యాటక, సాంస్కతిక శాఖా మంత్రి ఆర్. కె.రోజా, రాజంపేట, చిత్తూరు పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, ఎన్. రెడ్డప్ప, జిల్లా పరిషత్ చైర్మన్ గోవిం దప్ప శ్రీనివాసులు, కలెక్టర్ యం.హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, డి ఆర్ ఓ ఎన్ రాజశేఖర్ తెలిపారు.

జల్లికట్టు, కోడిపందేలు వద్దు : ఎస్‌పి

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

జిల్లాలో ఎక్కడా జల్లికట్టు, కోడి పందేలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో జల్లికట్టు, కోడి పందేల నిర్వహించడం నిషేధమని పేర్కొంటూ ఆయన పోలీసు అధికారులతో వైర్లెస్ సెట్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పిమాట్లాడుతూ జిల్లాలో కోడి పందేలు కట్టడికి రెవిన్యూ, జంతు సంక్షేమ సిబ్బంది, తదితర విభాగాలతో కలసి పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆటోలలో లౌడ్ స్పీకర్ ల ద్వారా ప్రచారం చేయాలన్నారు. కోళ్లకు కత్తులు కట్టి పందేలు ఆడటం మూగ జీవాలను హింసించడమే అవుతుందని, సంక్రాంతి పురస్కరించుకుని కోడి పందేలు, తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడరాదన్నారు. కోడి పందేల నిర్వహణ వేదికలకు ఎవరైనా తోటలు, స్థలాలు ఇస్తే వారిపై కూడా కేసులు నమోదు చేయాలని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. జిల్లాలో ఏ ప్రాంతంలోనైనా జల్లికట్టు, కోడి పందేలు జరుగుతున్నా... జరిగే వీలున్నా వెంటనే డయల్ - 100 లేదా జిల్లా పోలీసు వ్యాట్సాప్ నంబర్ 9440900005 కు ఫోన్ లేదా సంక్షిప్త సందేశం రూపంలో చేరవేయవచ్చన్నారు. పండగలకు ఊరెళితే వరుస సెలవులు ఉన్నందున ఇళ్లకు తాళం వేసి వేరే ప్రాంతాలకు వెళ్లే వారు 'లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్' యాప్ ద్వారా పోలీసులకు తెలియజేయాలని కోరారు.

రహదారుల భూసేకరణ వేగవంతం చేయండి : జేసీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

జిల్లాలో రహదారుల కోసం భూ సేకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని జాయింట్ కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి శుక్రవారం సాయంత్రం జాతీయ రహదారులు రైల్వే లైనులు కు సంబంధించి భూ సేకరణ గురించి వీడియో కాన్ఫరెన్స్ జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లాలో జాతీయ రహదారులకు సంబంధించి భూ సేకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అదే విధంగా కడప బెంగళూరు రైల్వే లైన్ కు సంబంధించి ఇప్పటికే సర్వే పనులు పూర్తి అయ్యాయని, త్వరలో నోటిఫికేషన్ ఇచ్చేందుకు ప్రభుత్వ అనుమతి కావాలని కోరామన్నారు. బెంగుళూరు చెన్నై ఎక్స్ప్రెస్ హైవేకి సంబంధించి కౌండిన్య అటవీ ప్రాంతంలో అనుమతులు కోసం మిగతా ప్రాంతాల్లో దాదాపుగా పూర్తి అయిందని వివరించారు. చిత్తూరు నాయుడుపేట ఆరు లైన్ల రహదారికి సంబంధించి 1.13 కిలోమీటర్ల మేరకు భూ సేకరణ చేయాల్సి ఉందని కోర్టు కేసులు పెండింగ్లో ఉందని వివరించారు. చిత్తూరు-తచ్చురు రహదారికి సంబంధించి కొన్నిచోట్ల భూ సేకరణ పెండింగ్ లో ఉందని వివరించారు. వేగవంతంగా భూ సేకరణ కార్యక్రమాలు జరుగుతున్నాయని, మరోవైపు రహదారుల నిర్మాణం కూడా జరుగుతోందని జాయింట్ కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి వివరించారు.

నిందితులకు 'లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం'

పజాశక్తి- చిత్తూర్ అర్బన్



క్రిమినల్ కేసులలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ముద్దాయిలకు మంచి అవకాశాన్ని సుప్రీంకోర్టు కల్పించిందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ. కరుణ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం పాత జిల్లా కోర్టు నందు నూతనంగా ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం కార్యాలయము నందు చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ముఖ్య న్యాయవాది సి. భాను శేఖర్ రెడ్డి తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉచిత న్యాయ సహాయ ముఖ్య న్యాయవాది సి.బానుశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సమ న్యాయం జరగాలన్నదే గౌరవ సుప్రీంకోర్టు ముఖ్య ఉద్దేశమని, అందుకోసం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇందులో వివిధ క్రిమినల్ కేసుల్లో ముద్దాయిలు గా ఉండి ఇబ్బందులు ఎదుర్కొంటూ జైల్లో ను, బెయిల్ పై ఉన్న అర్హత కలిగిన వారందరు ఉచితంగా న్యాయం పొందవచ్చునని తెలిపారు. ఉచిత న్యాయ సహాయ అదనపు న్యాయవాది మధుసూదన్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకులు పంపిణీ



చిత్తూరు అర్బన్ :జాతీయ క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా 'ప్రధాన మంత్రి క్షయ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో పి.కొత్తకోట సామాజిక ఆరోగ్య కేంద్రంలో 40 మంది క్షయ వ్యాధి గ్రస్తులకు పోషకాహారాన్ని జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ ప్రకాశం, జిల్లా ఇన్‌ఛార్జి అధికారి రవిరాజు అందజేశారు. జిల్లాలో 1,565 మంది క్షయ వ్యాధిగ్రస్తులు ఉండగా అందరికీ స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతలు ముందుకు వచ్చి వారికి కూడా మంచి పోషకాహారం అందించి క్షయ వ్యాధి జబ్బు నుండి నయము చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పావని చంద్ర, ప్రసాద్ రెడ్డి, డాక్టర్ శ్రావణి కుమార్ స్థానిక సర్పంచులు రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

క్లాప్ ఆటో డ్రైవర్లు పస్తులతో విధులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థలో క్లాప్ ఆటో డ్రైవర్లకు రెండు నెలల జీతాలు వెంటనే మంజూరు చేయాలని కోరుతూ రెడ్డి ఏజెన్సీకి వ్యతిరేకంగా శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రెడ్డి ఏజెన్సీ తీరుకు నిరసనగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నగరపాలక సంస్థల్లో, మున్సిపాలిటీలో పారిశుద్ధం పనులు నిర్వహణ కోసం క్లాప్ ఆటో డ్రైవర్లను నియమించారు. కాని అధికారుల వద్ద ,సంబంధిత ప్రభుత్వం వద్ద అగ్రిమెంటు కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం క్రాఫ్ట్ డ్రైవర్లకు ప్రతి నెల జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. సంక్రాంతి పండగకు సైతం జీతాలివ్వకుండా వేధింపులకు గురిచేస్తుండటం గమనార్హం.

సంక్రాంతి పోరాడే శక్తినిస్తుంది

- **నారావారిపల్లిలో 'వియ్యంకుల' సందడి**
- **ఊళ్లో అందరినీ పలకరించిన చంద్రబాబు**



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఈ సంక్రాంతి భవిష్యత్‌పై భరోసా కోసం పోరాడే శక్తినిస్తుందని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. సంక్రాంతి మూడు రోజుల పాటు జన్మస్థలమైన నారావారిపల్లిలో గడిపేందుకు చంద్రబాబు కుటుంబం, హీరో బాలకృష్ణ కుటుంబం నారావారిపల్లికి చేరుకున్నాయి. నారావారిపల్లిలో చంద్రబాబు, బాలకృష్ణలు వేర్వేరుగా టిడిపి నాయకులను, అభిమానులను, బంధువులను పలకరించి ఫొటోలు తీసుకున్నారు. మూడేళ్ల తరువాత సంక్రాంతి పండగకు విచ్చేసిన నారా చంద్రబాబునాయుడును అభిమానులు, కార్యకర్తలు కలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఎన్ఆర్ఐలు స్వగ్రామాలకు చేరుకుంటే సంక్రాంతికి కల వస్తుందన్నారు. నూతన ఉత్సాహం కోసం ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగాలన్నారు. ఆంధ్రప్రజలకు, తెలుగు జాతికి తాను ఇచ్చిన ఆయుధం ఐటి అని అన్నారు. ఈ ప్రభుత్వానికి అభివృద్ధి చేయాలనే ధ్యాస లేకపోగా బ్రాండ్ డ్యామేజి ఇమేజిను సొంతం చేసుకుందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తే ప్రజలు గుర్తిస్తారన్నారు. పవన్‌కల్యాణ్ మీటింగ్ పెడితే తిడతారని, తాను మీటింగ్ పెడితే కుట్ర చేసి మనుష్యులను చంపి జీవోలను తీసుకొస్తారని మండిపడ్డారు. తన లెక్క ప్రకారం రాజకీయాలకు అర్హత లేని వ్యక్తులు వైసిపి నాయకులన్నారు. ప్రజాస్వామ్యంలో సేవాభావంతో పనిచేసే వ్యవస్థ రాజకీయమని, ఈ వ్యవస్థలో రౌడీయిజం, గూండాయిజం, హత్యలు, కుట్రలు, కుతంతాలకు తావులేదన్నారు. తప్పులు చేస్తూ ఆ తప్పును పోలీసుల ద్వారా కప్పి పుచ్చుకోవాలని చూస్తున్నారన్నారు.

బాలకష్ణకు ఘన స్వాగతం

రేణిగుంట విమానాశ్రయంలో సినీ నటుడు నందమూరి బాలకష్ణకు శుక్రవారం ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, తెలుగు యువత నాయకులు రూపేంద్ర వర్మ, ఘనంగా స్వాగతం పలికి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం బాలకష్ణ సంక్రాంతి పండుగ సందర్భంగా నారావారిపల్లికు చేరుకున్నారు. సంక్రాంతి పండుగ మూడు రోజులపాటు నారవారిపల్లెలోనే పండగ జరుపుకుంటారు.

టిటిడిపై విమర్శలు సరికాదు : ఈవో

ప్రజాశక్తి -తిరుమల

తిరుమలలో కొన్ని వసతి గదులకు రేట్లు పెంచడంపై వివాదం చెలరేగుతోంది. బీజేపీ, టీడీపీ సహా పలు రాజకీయ పార్టీలు తీవ్రంగా మండిపడుతున్నాయి. ఇష్టారీతిన రేట్లు పెంచేస్తే..కొండ మీద భక్తులు ఎలా ఉండాలంటూ ప్రశ్నిస్తున్నారు. అయితే, ఈ ఆరోపణలపై తిరుమల తిరుపతి దేవస్థానం స్పందించింది. తిరుమలలో అద్దె గదుల ధరలు పెంచారన్న విమర్శలు సరికాదని టీటీడీ ఈవో ధర్మారెడ్డి అన్నారు. సామాన్య భక్తులకు కేటాయించే గదుల ధరలు పెంచలేదని స్పష్టం చేశారు. రాజకీయంగా దీనిపై చర్చ చేస్తున్నారని మండిపడ్డారు. పూర్తి సమాచారం తెలుసుకోకుండానే మాట్లాడటం బాధాకరమన్నారు. తిరుమలలో శ్రీవారి భక్తుల సౌకర్యార్థం మొత్తం 7500 గదులు ఉన్నాయి. అందులో 5000 గదులు 50 రూపాయలు, 100 రూపాయలు టారిఫ్ తో భక్తులకు అందుబాటులో ఉన్నాయి. మిగిలిన 1250 గదులు మాత్రం వెయ్యి రూపాయల టారిఫ్‌తో..ఎవరైతే ఆన్లైన్ ద్వారా 300 రూపాయల ఎస్.ఈ.డి దర్శనాలు బుక్ చేసుకుంటారో వారికి అడ్వాన్స్ ఆన్లైన్ అకామిడేషన్ ఆప్షన్ ద్వారా బుక్ చేసుకునేందుకు గాను ఉంటాయని టీటీడీ ఈవో ధర్మారెడ్డి చెబుతున్నారు.మరో 1250 గదులు తిరుమలలోని పద్మావతి ఏరియాలో వీవీఐపీల కోసం కేటాయించారు..ఇందులో 170 గదులకు మాత్రం ఏసీలు, గీజర్లు, వుడెన్ కబోర్డ్స్, కాట్స్ లాంటి వాటితో ఆధునీకరించారు. ఈ 170 గదులకు మాత్రమే అద్దెలు పెంచామని..పైగా ఇవి వీవీఐపీలకు మాత్రమే కేటాయిస్తున్నట్లు ఈవో చెప్పారు.. దీనివల్ల.. తిరుమల తిరుపతి దేవస్థానానికి ఎటువంటి ఆదాయం కూడా ఉండదని ధర్మారెడ్డి క్లారిటీ ఇచ్చారు.

సామాన్యుల గదులు విఐపిలకు కేటాయించొద్దు : సిపిఎం

తిరుమల కొండమీద సామాన్యులకు కేటాయించే గదుల్లో సౌకర్యాలు పెంచి, వీఐపీల ధరలు నిర్ణయించామని టీటీడీ యాజమాన్యం చెప్పడం విడ్డూరంగా ఉందని, సామాన్యులకు కేటాయించబడ్డ గదులను వారికే కొనసాగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విఐపి జోన్లో సామాన్యులకు ప్రవేశం లేకుండా చేసినట్లుగా తయారైందని ఆయన ఆ ప్రకటనలో విమర్శించారు. టిటిడి యాజమాన్యం పునరాలోచన చేయాలని, సామాన్యుల గదులను వారికే కేటాయించాలని ఆ ప్రకటనలో కోరారు. బిజెపి మత సమస్యగా చిత్రీకరించి ఉద్రిక్తతలు రెచ్చగొట్టడానికి చేస్తున్న ప్రయత్నాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ధరల పెంపు సమస్యను కాకుండా దీనికి మతం రంగు పులిమి ఓ పక్షాన్ని రెచ్చగొట్టే రీతిలో బిజెపి వైఖరి ఉందని ఇది నష్టం చేకూరుస్తుందని అన్నారు. ప్రజలు బిజెపి తప్పుడు వైఖరిని గమనించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా వివాదాలకు తావు లేకుండా టీటీడీ యాజమాన్యం, టిటిడి బోర్డు బాధ్యతగా వ్యవహరించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

'కోత' పెడితే ప్రభుత్వానికి 'వాతే'..!

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'బటన్' నొక్కేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి డబ్బుల కోసం వెతుకులాట.. దినదినగండం నూరేళ్ల ఆయుష్షు అన్న చందంగా ప్రభుత్వ తీరు ఉంది. ఈ క్రమంలోనే జగన్మోహన్‌రెడ్డి 'సంక్షేమానికి' కోత విధిస్తూ 'వెరిఫికేషన్' పేరుతో పేర్లు తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఈ 'కోత' నియోజకవర్గంలో తమకు ఎక్కడ 'వాత' పెడుతుందోనని ఎంఎల్ఎలు, మంత్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ నియోజకవర్గంలోనైనా అధికార, ప్రతిపక్ష పార్టీలకు మధ్య ఓట్లను చీల్చేది వేలల్లోనే ఉంటుంది. సంక్షేమానికి కోత పెడితే ఎక్కడ తమ పట్ల వ్యతిరేకత వస్తుందోనని ప్రజాప్రతినిధులు మదనపడుతున్నారు. చూసీ చూడనట్లు పోవాలంటూ అధికార యంత్రాంగంపైన ఒత్తిడి తెస్తుండటం గమనార్హం. తాజాగా పింఛన్ల కోత వైసిపి ప్రజాప్రతినిధుల మెడకు చుట్టుకోనుంది. గత ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి గాలి భానుప్రకాష్‌పై మంత్రి ఆర్‌కె రోజా 2,708 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అయితే నగరి, పుత్తూరు మున్సిపాలిటీల్లో 3వేలకు పైగా పింఛన్ల కోత పడనుంది.

పింఛన్లలో కోత వైసీపీ ప్రజాప్రతినిధుల మెడకు చుట్టుకుంటోంది. అసలే ఎన్నికలు వస్తున్న తరుణంలో ఇలాంటి చర్యలు రాజకీయంగా నష్టం తెస్తాయనే ఆవేదన అధికార పార్టీ ఎమ్మెల్యేల్లో వుంది. తక్కువ మెజార్టీతో బయటపడిన ఎమ్మెల్యేల్లో ఆవేదన కాస్త ఎక్కువే. మంత్రి రోజా పింఛన్ల కోతపై లబోదిబోమంటున్నారు. గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాశ్‌పై ఆమె 2,708 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఇప్పుడు ఆమె ప్రభుత్వంలో ఉన్నారు. దీంతో ప్రభుత్వంపై వ్యతిరేకత, ఇతరత్రా అంశాలన్నింటిని ఎదుర్కొని తిరిగి గెలవాల్సి వుంటుంది.వ్యతిరేకతకు ఏ చిన్న అవకాశం ఇవ్వకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదే. ఈ నేపథ్యంలో ఒక్క నగరి మున్సిపాలిటీలోనే వివిధ రకాల పింఛన్లు 1,623 చొప్పున కోత విధించేందుకు అధికారులు నిర్ణయించారు. అలాగే పుత్తూరు మున్సిపాలిటీలో కాస్త అటుఇటుగా ఇదే సంఖ్య వుంది. గ్రామీణ స్థాయిలో పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నగరి వైసీపీ నేతలు అంటున్నారు. ఈ నెల 18వ తేదీ వరకూ వెరిఫికేషన్‌కు ప్రభుత్వం సమయం ఇచ్చిందని సమాచారం. పింఛన్ల కోతకు సంబంధించి లబ్ధిదారులు వైసీపీ నేతల వెంటపడుతున్నారు. దీంతో మంత్రి రోజాతో పాటు ఆ నియోజకవర్గంలోని వైసీపీ నేతలు సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ...ఎన్నికల సమయంలో తమకు నష్టం కలిగించే పనులు చేయొద్దని ఆగ్రహించినట్టు సమాచారం. తాము గెలిచిందే 3 వేల లోపు మెజార్టీతోనే అని, తీరా పింఛన్లు కూడా అదే సంఖ్యకు తగ్గకుండా చేస్తే...తాము ఏం చేయాలని మంత్రి రోజా నిలదీసినట్టు తెలిసింది. ఒక వైపు వెరిఫికేషన్ సమయం సమీపిస్తుండడం, మరోవైపు అధికారుల నుంచి తగినంతగా భరోసా లభించకపోవడంతో అధికార పార్టీ నేతల్లో ఆందోళన కనిపిస్తోంది.

ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు తీసుకుంటున్న వారిలో ఎంత మంది ఓట్లు వేస్తారో తెలియదు కానీ, కోల్పోయిన లబ్ధిదారులు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అధికార పార్టీకి వ్యతిరేకంగా ఎన్నికల్లో వ్యవహరిస్తారని అధికార పార్టీ నేతలు వాపోతున్నారు. దీంతో ఒక్కో ఇంట్లో నాలుగేసి ఓట్లు చొప్పున లెక్కేసుకున్న ఐదారు వేల ఓట్లు కోల్పోతామని రోజా వాదన. రోజాతో పాటు వైసీపీ ఎమ్మెల్యేల ఆవేదనను ముఖ్యమంత్రి జగన్ ఎంత వరకు పట్టించుకుంటారో వేచి చూడాలి.

మంత్రి నియోజకవర్గంలో 'పింఛన్ల'పై మల్లగుల్లాలు

కనుమూరు సేవలు స్ఫూర్తిదాయకం



ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు పట్టణంలో ఏటా పండుగలకు ముందే క్రీడల పండుగకు శ్రీకారం చుడుతున్న కేహెచ్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కనుమూరు హరిచంద్రారెడ్డి సేవలు స్ఫూర్తిదాయకమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో మాస్టర్ క్రికెట్ లీగ్ పోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదిహేనేళ్లుగా పట్టణంలో పండుగల సమయంలో క్రీడాకారులకు క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నారని తెలిపారు. పోటీలలో తానూ ప్రాతినిధ్యం వహిస్తుండటం చాలా సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. ఓ వైపు పట్టణాభివద్ధికి సొంత నిధులు కేటాయించి పట్టణంలో అనేక అభివద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టారన్నారు. అలాగే జాతీయ స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తూ గ్రామీణ ప్రాంత క్రీడాకారుల అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. కేహెచ్ఆర్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు కనుమూరు హరిచంద్రారెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు ఆరోగ్యం, వినోదం, ఉల్లాసం కల్పించేందుకు మాస్టర్ క్రికెట్ లీగ్ పోటీలు దోహదపడుతున్నాయన్నారు. అనంతరం అతిథుల చేతులమీదుగా క్రీడా పోటీలను ప్రారంభించారు.

గూడూరు : మానసిక ఉల్లాసానికి క్రీడలు ప్రధానమని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని యువకుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు ఈనెల 17,18వ తేదీలలో అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. స్థానిక అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో క్రీడాకారుల టీ షర్టులను ఆయనతోపాటు కనుమూరి హరిచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ సాయినాథ్, వైసీపీ నాయకులు మనపాటి రవీంద్రబాబు, మునిగిరీష్‌ల చేతుల మీదుగా ఆవిష్కరించారు. బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆత్మకూరు బాలకష్ణ తదితరులు పాల్గొన్నారు.

కీనాటంపల్లిలో వైద్యసేవలు



ప్రజాశక్తి-యదమరి: ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ పిలుపునిచ్చారు. యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కీనాటంపల్లి సచివాలయంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ చిన్న చిన్న జబ్బులకు గ్రామాల్లోనే వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ప్రతినెలా మూడో శుక్రవారం వైద్య సేవలు అందించేందుకు గ్రామానికే వైద్యులు వస్తారన్నారు. ప్రతిఒక్కరూ వైద్య సేవలు పొందాలని కోరారు. సీహెచ్ఓ లక్ష్మీనారాయణ, ఎంఎల్‌హెచ్‌పీ దిల్షాద్, మహిళా ఆరోగ్య కార్యకర్త అమ్ములు, ఆశా కార్యకర్తలు భువనేశ్వరి, అంజలి పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులు లైఫ్ సర్టిఫికెట్ అందించాలి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు లైఫ్ సర్టిఫికెట్లు అందించాలని ఎస్‌టీవో హరిప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. బంగారుపాళ్యం ఖజానా కార్యాలయం సంబంధించిన విశ్రాంతి ఉద్యోగులు ఫిబ్రవరి నెలాఖరు లోపు లైఫ్ సర్టిఫికేట్‌లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని.. పింఛనుదారులు ఆధార్, బ్యాంకు పాసుపుస్తకం, పెన్షన్ పాస్ పుస్తకంతో పాటు మొబైల్ ఫోన్ (ఓటీపీ కోసం) తీసుకురావాలన్నారు. సబ్ ట్రెజరీ కార్యాలయం పరిధిలోని ఉద్యోగులు, పెన్షనర్లు సీఎఫ్ఎంఎస్ ఐడీతో ఆధార్, ఫోన్‌నంబర్లను అనుసంధానం చేసుకోవాలని తెలిపారు.

బాధిత కుటుంబానికి బీమా పంపిణీ

ప్రజాశక్తి-రొంపిచెర్ల: చెంచెంరెడ్డిగారిపల్లి పంచాయతీ శ్రీరాముల వడ్డిపల్లిలో సర్పంచ్ సుధారాణి సూర్యనారాయణరెడ్డి చేతుల మీదుగా ఇటీవల అనారోగ్యంతో మతిచెందిన మల్లికార్జున కుటుంబానికి శుక్రవారం ప్రభుత్వం అందించిన బీమా సొమ్మును అందించారు. రూ.10 వేలు చెక్కును అందించి త్వరలోనే రూ.90 వేలు నామిని ఖాతాలో జమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, వెలుగు సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది గైర్హాజరు



ఉదయం 10.30 గంటలకు తాళాలు తీయని గదులు

ప్రజాశక్తి-పాలసముద్రం: మండలంలోని వనదుర్గాపురం సచివాలయంలో డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు రోజూ విధులకు సమయానికి హాజరు కావడం లేదని.. సమస్యలపై సచివాలయానికి వచ్చేవారిని బాగా తిప్పుకుంటున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. శుక్రవారం 10.30 గంటలైనా డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్ల గదులు తాళం వేసి ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వారికి సమస్యలపై అర్జీలు అందించినా ప్రజలపై మండిపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్న సమయంలో 12.30 గంటలకు భోజనానికి వెళ్లి 3 గంటల వరకు కార్యాలయానికి వస్తున్నారన్నారు. పంచాయతీ కార్యదర్శి సచివాలయానికి వచ్చినా డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు కార్యాలయానికి రాకపోవడంతో ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తూకాల్లో తేడాలొస్తే కఠిన చర్యలు



ప్రజాశక్తి-పాలసముద్రం: నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయకుండా తూకాల్లో తేడాలొస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దారు బాబు సూచించారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు సకాలంలో డీడీలు కట్టి నిర్ణీత సమయంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. ఉచితంగా పంపిణీ చేసిన బియ్యాన్ని తూకాల్లో తేడా లేకుండా పంపిణీ చేయాలని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు మధు, సివిల్ సప్లై డీటీ విజయ్‌కృష్ణ, డీలర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కేసులు



జక్కదొన గ్రామంలో ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన బోర్డు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని జక్కదొన గ్రామంలోని సర్వేనంబరు 769 రెవెన్యూ లెక్క దాఖలలో ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని తహశీల్దార్ పుల్లారెడ్డి గురువారం తెలిపారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతోందని.. ఆ భూమిలో ఎవరైనా ప్రవేశిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిపై రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు.

వెదురుకుప్పంలో భూకబ్జాలను అరికట్టాలి



ప్రజాశక్తి-వెదురుకుప్పం: నచ్చుకూరులో జరుగుతున్న భూఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి డాక్టర్ యుగంధర్ కోరారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వెదురుకుప్పం మండలంలో భూకబ్జాలు అధికమవుతున్నాయని.. ఎంతటి వారైనా వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని.. సంబంధిత అధికారులు, ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన ప్రజాప్రతినిధులే భూకబ్జా చేయడం ఎంతవరకు న్యాయమని.. సమగ్ర సర్వే చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

డీన్ ఫాకల్టీ ఆఫ్ సైన్స్ గా ఆచార్య రత్నాకర్

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీయూనివర్సిటీ సైన్స్ కళాశాల ఫాకల్టీ డీన్ గా భౌతిక శాస్త్ర విభాగానికి చెందిన సీనియర్ ఆచార్యులు రత్నాకర్ ను నియమిస్తూ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె రాజారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మాజీ టీటీడీ ఛైర్మన్ కనుమూరి బాపిరాజుకు సన్మానం



ప్రజాశక్తి-కార్వేటినగరం: టీటీడీ మాజీ ఛైర్మన్ కనుమూరి బాపిరాజు దంపతులను శుక్రవారం కార్వేటినగరంలో క్షత్రియుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. దంపతులు శ్రీవేణుగోపాలస్వామివారిని శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టీటీడీ వేద పండితులు వేద మంత్రోచ్ఛరణలతో ఆశీర్వదించి వేణుగోపాలస్వామి వారి ప్రసాదాన్ని అందించారు. అనంతరం మండలంలోని క్షత్రియులు వారిని శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టీటీడీ ఛైర్మన్ గా ఉన్నప్పుడు స్కంద పుష్కరిణి చుట్టూ సీసీ రోడ్డు ఏర్పాటుకు రూ.75 లక్షలు మంజూరు చేసి అభివద్ధి చేశానని.. అలాగే వేణుగోపాలస్వామి ఆలయ దర్శనార్థం ఏపీ టూరిజం బస్సులను భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఆలయ అభివద్ధికి కషి చేసినట్లు పేర్కొన్నారు. వారి వెంట క్షత్రియులు ధనంజయవర్మ, పురుషోత్తంరాజు, జనార్దన్‌రాజు, నాగేశ్వరరాజు, యువరాజు, శేఖర్‌రాజు, చందురాజు, రవిరాజు, సుబ్రహ్మణ్యంరాజు, అంబరిశిరాజు, గణేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు తనిఖీ



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దేవదొడ్డి గ్రామంలో డాక్టర్ పద్మావతి ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వైద్యసేవలు అందించారు. కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ హరినాథ్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ సమయపాలన పాటించాలని.. ఉదయం 9 నుంచి ఓపి సేవలు , మధ్యాహ్నం 2 గంటల నుంచి ఆరోగ్యశ్రీ ఆపరేషన్ చేయించుకున్న వారిని సందర్శించాలని ఆదేశించారు. దేవదొడ్డి గ్రామంలోని కేకే గోవిందరాజ్ కుడికాలు ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ చేయించుకొని రావడంతో వారిని పరామర్శించారు. సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ అరుణకుమార్, డాక్టర్ పద్మావతి, డాక్టర్ శ్రీదేవి, సిబ్బంది బేబీ, వినాయకమ్మ, సరిత, జమునారాణి తదితరులు పాల్గొన్నారు.

నూతన మార్కెట్ యార్డు పరిశీలన



ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరులోని నూతన వ్యవసాయ మార్కెట్ యార్డును మార్కెటింగ్ ఏడీ పరమేశ్వరన్ శుక్రవారం సందర్శించారు. వి.కోట మండలంలోని శివునికుప్పంలో 8.09 ఎకరాల ప్రభుత్వ మార్కెట్ యార్డు స్థలానికి సంబంధించి రాబోయే మామిడి సీజన్‌లో ఏర్పాటు చేయడానికి పరిశీలించారు. ఆయన వెంట జిల్లా మార్కెటింగ్ డీఈ హరినాథ రెడ్డి, హేమంత్ కుమార్‌రెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్, ఉపాధ్యక్షులు పుష్పలత, ఆంజనేయులు, వేణుగోపాల్ రెడ్డి, మార్కెట్ యార్డు కార్యదర్శి సంజీవ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలతో అవంతి పరిశ్రమ చెలగాటం




ప్రజాశక్తి-వరదయ్యపాళ్యం: మండలంలో అవంతి చర్మ పరిశ్రమ వద్ద వరదయ్యపాళ్యం, బీఎన్ కండ్రిగ మండలాల ప్రజాప్రతినిధులు, స్థానికులు శుక్రవారం నిరసన తెలిపారు. వివరాలిలా.. వరదయ్యపాళ్యం మండలం పర్యాటక ప్రాంతం ఉబ్బలమడుగు సమీపంలోని అవంతి పరిశ్రమ నుంచి ప్రాణాంతక రసాయన వ్యర్థాలను గుట్టుచప్పుడు కాకుండా కాలువలోకి వదలి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారంటూ ప్రజాప్రతినిధులు ప్రసాద్, దుడ్డు వేణు ఆధ్వర్యంలో స్థానికులు చర్మ పరిశ్రమ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమ ఆవరణం వద్దకు చేరుకొని ఇటువంటి పనులు మానుకోవాలని కోరారు. అందుకు పరిశ్రమ యాజమాన్యం విరుద్ధంగా స్పందించడంతో కొంత గందరగోళ పరిస్థితి ఏర్పడింది. పరిశ్రమ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రసాద్ మాట్లాడుతూ రాత్రి వేళ ప్రాణాంతక వ్యర్థాలను వదలడంతో పంటలు ఎండిపోతున్నాయని, ప్రజల ప్రాణాలకు ముప్పు ఉందని, ప్రజల ప్రాణాలంటే లెక్క లేదా.. అంటూ మండి పడ్డారు. తాము వ్యర్థాలను కాలువలో వదలడం లేదని పరిశ్రమ ప్రతినిధులు బుకాయించారు. దీంతో లోపలకు వెళ్లి పరిశీలిస్తామని.. అప్పుడు నిజాలు తెలుస్తాయని ప్రజాప్రతినిధులు పట్టుబట్టడంతో పరిశ్రమ ప్రతినిధులు లోనికి నిరాకరించారు. తప్పుచేయకపోతే లోనికి ఎందుకు అనుమతించరని ప్రశ్నించడంతో వాగ్వాదం జరిగింది. ఎస్సై నాగార్జునరెడ్డి చేరుకుని ఇరువర్గాలతో చర్చించి లిఖిత పూర్వక హామీ ఇప్పిస్తామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

టీడీపీతోనే అందరికీ సమాన న్యాయం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : ఎస్సీ, ఎస్టీ, బీసీ సబ్ ప్లాన్ నిధులు.. సంక్రాంతి కానుకలు రద్దు చేసి, ఉపాధి లేక యువతను నిర్వీర్యం చేసి, చీకటి జీవోలతో ప్రజలను, ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తే ప్రజాస్వామ్యంలో కుదరదని.. వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన జీవో–1ని హైకోర్టు బ్రేక్ వేయడం హర్షనీయమని నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ అన్నారు. శుక్రవారం పుత్తూరు మండలంలోని కష్ణ సముద్రం పంచాయతీలో 'ఇదేం ఖర్మ.. మన రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత 75 ఏళ్లలో ఏ ప్రభుత్వం ఇలాంటి జీవో తీసుకురాలేదని హైకోర్టు వ్యాఖ్యానించడం వైసీపీ ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదన్నారు. మాయమాటలతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఒక్క ఛాన్స్ పాలన చూసిన ప్రజలు ఎప్పుడెప్పుడు పనికిమాలిన ప్రభుత్వం దిగిపోతుందా అని ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఎస్సీ, బీసీ సబ్ ప్లాన్ రద్దు చేసి కోట్ల నిధులు వారికి కాకుండా చేశారని.. టీడీపీ పాలనలో ప్రతి సంక్రాంతికి పేద ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని అందించిన సంక్రాంతి కానుకలు నిలిపివే యడం దారుణమన్నారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెంచడంతో పేద ప్రజలు పండుగలకు సంతోషంగా ఉండలేని పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బాలాజీ, కరుణ, జగదీష్, శాంతరాజ్, విజయ్, రాజా, నరేష్, విజయ్, సురేష్, జగదీష్, నరేష్, బాలరాజు, పాండ్యన్, ఆనందరాజ్, ఆమూల్‌రాజ్, చంద్ర, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కలునరీ యూనివర్సిటీతో మహిళా వర్సిటీ ఒప్పందం



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం లోని గహ విజ్ఞాన శాస్త్రం, ఇండియన్ కలునరీ యూనివర్సిటీ తో మహిళా వర్సిటీ అవగాహనా ఒప్పందం శుక్రవారం విసి చేసుకున్నారు. ఈ మేరకు వర్సిటీ అధికారులు అవగాహన ఒప్పంద పత్రాలను వర్సిటీ ఇంచార్జ్ ఉపకులపతి ఆచార్యకే రాజారెడ్డి ఆధ్వర్యంలో మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎం ఓ యు యొక్క ముఖ్య ఉద్దేశం ఏమిటంటే రెండు విద్యాసంస్థల మధ్య ఉన్నటువంటి సదుపాయాలని విద్యార్థుల కొరకు వినియోగించుకోవచ్చని చెప్పారు. విద్యార్థులలో స్కిల్ డెవలప్మెంట్ ను పెంచడానికి ఉపయోగకరముగా ఉంటాయని, రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ కి తోడ్పడుతుందని వెల్లడించారు. అధ్యాపకుల యొక్క అవసరాన్ని బట్టి ఈ రెండు విద్యాసంస్థలు వారిని కూడా వర్క్ షాపులు, కాన్ఫరెన్స్ లు, సెమినార్లలో కాని ఇతర గెస్ట్ స్పీకర్లుగా ఉపయోగపడతారని అన్నారు. ఈఎంఒయూ రెండు విద్యాసంస్థల యొక్క రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ కి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు



ప్రజాశక్తి -రామకుప్పం: మండల పరిధిలోని విజలాపురం శారద ఇంగ్లీష్ మీడియం స్కూల్, కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం భోగి మంటలు వేసి తెలుగు సాంప్రదాయ దుస్తులు ధరించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గోపూజ ,లక్ష్మీ పూజలు నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మంజునాథ్, విద్యార్థులు, తల్లితండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతారామాంజనేయ ఆలయ నిర్మాణానికి విరాళాలు



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని దేవదొడ్డిలో నిర్మితమవుతున్న సీతారామాంజనేయుల ఆలయానికి దాతల విరాళాలు కొనసాగుతున్నాయి. మండలంలోని విరుపాక్షపురానికి చెందిన మోహనరావు కుటుంబం రూ.10,116, మహతి ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజు మిత్రుడు రూ.5,233 ఆలయ కమిటీకి అందించారు. దాతలను అభినందించారు.

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ



ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని కోగిలేరు గిరిజనులకు శుక్రవారం సర్పంచ్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో సామాజిక సేవా సంఘ సంస్కర్త కల్లుపల్లి చిన్న, అతని స్నేహితులు మల్లేరు బాలాజీ, కల్లుపల్లి గంగాధర్ ల సహకారంతో మాస్క్ లు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ బాబు మాట్లాడుతూ పలమనేరు నియోజకవర్గంలోని పలు మండలాల్లోని ఎస్సీ, ఎస్టీ కాలనీలలో కరోనా ప్రారంభమైన సమయం నుంచి పలు సందర్భాలలో నిరుపేదలకు పలు సేవా కార్యక్రమాలను చిన్న నిర్వహిస్తుండటం గొప్ప విషయమన్నారు. అలాగే భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గణపతి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, సుబ్రహ్మణ్యం, సుబ్బన్న, గౌతంరెడ్డి, మునిరత్నమ్మ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

ప్రజాశక్తి తిరుమల

తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయి, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేశ్వర రెడ్డి, తెదేపా ఎమ్మెల్యే మంతెన రామరాజు, వైకాపా ఎమ్మెల్యే వాసుబాబు, ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్యలు స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేసి శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

నేర సమాచారం

వాహనాలతో సహా ఎర్రచందనం స్వాధీనం

8 మంది ముద్దాయిల అరెస్టు



ప్రజాశక్తి - కార్వేటినగరం: వాహనాలతో సహా రూ.10 లక్షలు విలువ చేసే ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని 8 మంది ఎర్రదొంగలను అరెస్టు చేసినట్లు నగరి డీఎస్పీ రవికుమార్ వెల్లడించారు. శుక్రవారం సీ.ఐ కార్యాలయం ఆవరణలో ఎర్రచందనం దొంగల అరెస్టు చూపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిల్లా ఒంటిమిట్ట మండలం చింతలరాజుపల్లి గ్రామానికి చెందిన జంగాల భద్రయ్య కుమారుడు శివశంకర్(42), తమిళనాడు రాష్ట్రంలోని సేలం జిల్లా ముట్టల్ గ్రామానికి చెందిన చిన్నదొరై, తరివన్నమలై జిల్లా కీల్‌నగర్ గ్రామానికి చెందిన ధరణి, అలాగే కడప జిల్లా ఒంటిమిట్ట మండలం మడమపల్లి గ్రామానికి చెందిన వినోద్ కుమార్, తమిళనాడు రాష్ట్రం విల్లుపురం జిల్లా ఇంద్రానగర్ గ్రామానికి చెందిన గార్డ్రోబన్, తిరుపతి జిల్లా కేవీబీ పురం మండలం ఆరె గ్రామానికి చెందిన జె.కొట్టి, సేలం జిల్లా వేపుడి పాలకాడి గ్రామానికి చెందిన మారిముత్తు, సేలం జిల్లా ముట్టల్ గ్రామానికి చెందిన జయరాజ్‌లు కలసి ఓ ముఠాగా ఏర్పడి శేషాచలం అటవీ ప్రాంతంలో ఎర్రచందనం చెట్లను నరికి శుక్రవారం వేకువ జామున మూడు వాహనాల్లో వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం మీదుగా తమిళనాడుకు తరలిస్తుండగా రహస్య సమాచారం మేరకు ఎస్.ఐ దస్తగిరి తమ సిబ్బందితో అమ్మపల్లి క్రాస్ వద్ద కాపుకాచి ఎర్రచందనం తరలిస్తున్న దొంగల ముఠాను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 12 ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ మూడు వాహనాలతో సహా సుమారు రూ.10 లక్షలు ఉంటుందని వెల్లడించారు. కడప జిల్లా ఒంటిమిట్టకు చెందిన శివశంకర్‌పై ఇప్పటికే 90 కేసులు ఉన్నాయని, రెండుసార్లు పీడీ యాక్టు కేసులు నమోదయ్యాయని డీఎస్పీ పేర్కొన్నారు. అలాగే శివశంకర్ తండ్రి భద్రయ్య ఎర్రచందనం తరలింపు కేసులో ముద్దాయిగా ఉన్నారని తెలిపారు. అరెస్టు చేసిన ఎర్ర దొంగలను తిరుపతి కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలిస్తున్నట్లు చెప్పారు. వారి వెంట సీ.ఐ చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


పేకాట స్థావరంపై పోలీసుల దాడి

నగదు, సెల్‌ఫోన్లు, మోటార్ సైకిళ్లు స్వాధీనం



ప్రజాశక్తి-పలమనేరు: పేకాట స్థావరంపై పోలీసులు మెరుపు దాడి చేసి భారీ నగదుతోపాటు మోటార్‌సైకిళ్లు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని 17 మందిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఈనెల 12న గురువారం పలమనేరు మండలం మొరం పంచాయతీ సమీపంలోని పత్తికొండ రిజర్వ్ ఫారెస్ట్ లో కొలమాసనపల్లి గ్రామానికి చెందిన శంకర్, పెద్దపంజాణి మండలం అప్పినపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ ఇరువురు ఆర్గనైజర్లుగా వ్యవహరిస్తూ వారికి తెలిసిన వ్యక్తులతో మంగతాయి అనే జూదం ఆడిస్తున్నట్లు అజ్ఞాత వ్యక్తుల ద్వారా పక్కా సమాచారం అందింది. ఈ మేరకు సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎస్సైలు నాగరాజు, సుబ్బారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ పోలీస్ శ్రీనివాసులు, క్రైమ్ పార్టీ సిబ్బంది మూకుమ్మడిగా దాడి చేసి పేకాట రాయుళ్లను పట్టుకున్నారు. వారి నుంచి రూ.3.83 లక్షల నగదు, 16 మోటార్ సైకిళ్లు, 17 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. టీఎస్ సురేష్‌బాబు, ఓబులేసు, వెంకటస్వామి, దినేష్, లోకేష్, ఆనంద్, ఆర్. చంద్రబాబు, భాస్కర్, దిలీప్ కుమార్, రాజశేఖర్, సుబ్రహ్మణ్యంరెడ్డిలపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని తెలిపారు. పోలీస్ సిబ్బందిని డీఎస్పీ సుధాకర్ రెడ్డి అభినందించారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళులు



ప్రజాశక్తి-రామకుప్పం: మండల పరిధిలోని బల్ల గ్రామానికి చెందిన టీడీపీ వీరాభిమాని మునెప్ప అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందారు. శుక్రవారం మండల టీడీపీ నేతలు ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మునస్వామి, పార్టీ యువత అధ్యక్షులు విశ్వనాథ్, ఎస్సీసెల్ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, నేతలు గంట్లప్ప గౌడు, జయంశంకర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.